


మద్యం వల్ల కుటుంబాలు కూలిపోతాయి. మద్యం మీద ప్రభుత్వాలు నడుస్తాయి. రాజకీయ మాయాజూదంలో మద్యం ఒక పావు. 'అధికారంలోకి రాగానే సంపూర్ణంగా మద్యం లేకుండా చేసేస్తా..' అని చెప్పిన జగన్ ఐదేళ్లు ఏకంగా ప్రభుత్వ దుకాణాలే తెరిచి విచ్చలవిడిగా మద్యం అమ్మించాడు. 'నియంత్రిస్తా.. ఎమ్మార్పీకే అమ్మిస్తా.. మాట వినకపోతే బెల్టు తీస్తా!' అని చెప్పిన చంద్రబాబు చేతులెత్తేస్తున్నాడు. దుకాణాల వేలం పాటలైతే జిల్లాలో పారదర్శకమేగానీ, నిర్వహణ మాత్రం అధికారం చేతుల్లోనే కొనసాగుతోంది. నాయకుల కనుసన్నల్లోనే షాపులు నడుస్తున్నాయి. రాజీబేరాలూ, దబాయింపులూ దారికి తెచ్చేశాయి. వైసీపీ అనుభజ్ఞులతో కలిసిపోయి మరీ కొత్త కూటములు ఏర్పడ్డాయి. దుకాణాలు బార్లుగా మారిపోయాయి. ఊరూరా బెల్టుషాపులు వర్ధిల్లుతున్నాయి. ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది.

8వ పేజీలో

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన నిజాలు

తెగ తాగిస్తున్నారు!

● అసెంబ్లీలో మన వాయిస్

తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేసేశారు



'తిరుపతిరూరల్ మండలం లోని దళవాయిపరిధిలోని చెరువు నిండాక పేరూరుకు.. అక్కడ్నుంచి తుమ్మలగుంట చెరువుకు.. అనంతరం అవిలాల, తిరుచానూరు చెరువులకు నీరు వెళ్తుంది. అటువంటి తుమ్మలగుంట చెరువును సుందరీకరణ పేరుతో గత చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సుమారు రూ.60కోట్ల తుడా నిధులు మళ్లించి ఖర్చు పెట్టారు. అభివృద్ధికి మేము అడ్డురాము. కానీ, తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేయడంతో తాగునీరు సమస్య ఉంది. చెరువు పరిధిలో భవనాలు ఎక్కువ. ఈ చెరువు ఆయకట్టు సుమారు 118 ఎకరాల్లో ఉండగా.. చెరువు(ట్యాంక్) 143 ఎకరాలు. చెరువును క్లోజ్ చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్‌జీటీ రూల్స్, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఎక్కడగానీ చెరువును మూయకూడదు. కానీ, తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారు. ఇప్పుడు మనిషిని పంపినా కూడా చూడొచ్చు. దానివల్ల వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయి' అంటూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అసెంబ్లీలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి నారాయణ స్పందిస్తూ.. 'చెరువు ఆయకట్టు 88.8 ఎకరాలు. ఇందులో 45ఎకరాల్లో గ్రావెల్‌తో లెవల్ చేసిన మాట వాస్తవమే. దాంట్లో పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఉన్నాయి. ఇక్కడ వాటర్ కంట్రోల్ చేసే గేటు కానీ, మిగులు నీళ్లు కిందకి పోయే నిర్మాణాన్ని, లోపల నీళ్లుండే ఏరియాని డిస్టర్బ్ చేయలేదు' అని పేర్కొన్నారు. దీనిపై నాని స్పందిస్తూ.. తుమ్మలగుంట చెరువుకు నీళ్లు వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారని స్పష్టంచేశారు. ఇప్పుడైనా దానిని చూడొచ్చన్నారు. దీంతో వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు, ఎన్జీటీ ఆర్డర్ ప్రకారం కొన్ని పనులు చేయకూడదు. తుమ్మలగుంట చెరువులో అవి చేశారు. వాటిపై యాక్షన్ తీసుకుంటాం' అని మంత్రి నారాయణ అన్నారు.

- తిరుపతిరూరల్/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

'పెంచలకోన'లో కనీస వసతులు కల్పించండి



వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం పెంచలకోనలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గరువారం అసెంబ్లీలో కోరారు. 'ఈ ఆలయానికి ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఆదాయం వస్తున్నా భక్తుల మనోభావాలకు తగ్గట్టు వసతులు లేవన్నారు. భక్తులకు సరిపడా వసతి గృహాలు నిర్మించడంతోపాటు ఆదురుపల్లి-పెంచలకోన రోడ్డును డబుల్ రోడ్డుగా చేయాలన్నారు. కొండపై నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటిని చెక్‌డ్యాం కట్టి భక్తులకు తాగునీటి అవసరాలు తీర్చవచ్చని సూచించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ఆలయానికి రాబడి మరింత పెరుగుతుందన్నారు. వెయ్యి మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా వంటశాలను నిర్మించాలన్నారు.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

'కూటమి' చెంతకు కార్పొరేటర్లు

● విజయవాడకు 12మంది పయనం
● నేడు మంత్రులు లోకేశ్, అనగానిని కలిసేందుకు అపాయింట్మెంట్
● టచ్‌లో మరో ఏడుగురు, ఇప్పటికే కూటమిలో ఆరుగురు
● 25 మంది బలంతో అవిశ్వాస తీర్మానానికి..

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండన్నరేళ్లు దాటాక అవిశ్వాస తీర్మానం పెట్టేలా పురపాలక చట్టానికి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వం సవరణ చేసిన నేపథ్యంలో తిరుపతిలోని కూటమి నాయకులు వేగంగా పావులు కదుపుతున్నారు. వైసీపీ కార్పొరేటర్లు కూటమి ముఖ్యనేతలను కలిసేందుకు విజయవాడకు వెళ్లారు. రాష్ట్ర మంత్రి పార్థసారధిని కలిసినట్టు తెలుస్తోంది. ఇక, మంత్రులు నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అపాయిమ్మెంట్ శుక్రవారం తీసుకున్నట్టు సమాచారం. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు.. మహిళా కార్పొరేటర్ల కుటుంబసభ్యులు పొన్నాల చంద్ర, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, నీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య, ఆదం లీలావతి తదితరులు విజయవాడకు వెళ్లినవారిలో ఉన్నట్టు సమాచారం. తన కుమార్తెను మేయర్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న అన్నా రామచంద్రయ్య కూడా వీరితో వెళ్లారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ యువ కార్పొరేటర్, సింగాలగుంటకు చెందిన మరో కార్పొరేటర్లు అసంతృప్తితో ఉన్న ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లను ఏకం చేసేపనిలో ఉన్నారు. విజయవాడకు వెళ్లినవారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కూటమి పార్టీలో ఉన్న ఆరుగురితో కలిపి 25 మంది కార్పొరేటర్ల బలం పెరుగుతుంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే కూటమి నెగ్గే అవకాశం ఉంటుంది. ఈ బాధ్యతను రెండు పార్టీలతో సత్సంబంధాలు కలిగి, గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన తుడా మాజీ ఛైర్మన్‌కు అప్పగించనున్నట్టు తెలుస్తోంది.

● 50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. ఎన్నికల ముందు డిప్యూటీ మేయర్ అభినయ్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు నాయక్ అనే కార్పొరేటర్ మృతిచెందారు. అంటే మూడు డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. మిగిలిన 47 డివిజన్లలోని కార్పొరేటర్లలో ఆధిపత్యం ఎటువైపుంటే వారికే మేయర్ కుర్చీ దక్కుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. కొత్తగా చేరబోయే కార్పొరేటర్లతో కూటమి ప్రభుత్వానికి సరిపడా మెజారిటీ ఉండబోతోంది. చట్టసవరణ నేపథ్యంలో మేయర్ డాక్టర్ శిరీష అవిశ్వాసానికి మానసికంగా సిద్ధపడినట్టు తెలుస్తోంది.



డీఎంఏకి ఏమైంది..?

విచారణ ఎదుర్కొంటున్న వర్మ, చిట్టిబాబుపై ప్రేమ

తిరుపతిలో పోస్టింగ్ ఇచ్చేందుకు పరిశీలించమని కమిషనర్‌కు లేఖ

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) హరి నారాయణ అవ్యాజమైన ప్రేమను ప్రదర్శిస్తుండడం ఆశ్చర్యం గొలుపుతోంది. మంత్రి నారా లోకేశ్‌కు అందిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డీఎంఏ విచారణకు ఆదేశించారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కమిటీని నియమించారు. గతంలో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబుతో పాటు డీఈ విజయకుమార్ రెడ్డిపై వారం రోజులుగా లోతైన విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంఏ పంపిన లేఖ మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తిరుపతి ఆర్వో నుంచి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిపాలనాధికారిగా బదిలీ అయిన కేఎల్ వర్మను ఆరోగ్య సమస్యలతో, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ ఏవోగా బదిలీ అయిన మేనేజర్ చిట్టిబాబును వ్యక్తిగత కారణాలపై తిరిగి తిరుపతి కార్పొరేషన్‌కు తీసుకునేందుకు పరిశీలించాలని కమిషనర్ మౌర్యకు డీఎంఏ లేఖ రాయడం అందరినీ విస్తుపోయేలా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి ఆరోపణలున్న అధికారులపై నెలరోజుల క్రితం డీఎంఏ బదిలీ వేటు వేశారు. వారిపై ఆర్డీ నేతృత్వంలో విచారణకు ఆదేశించింది కూడా ఆయనే. అలాంటిది ఆ అధికారులను తిరిగి చేర్చుకోమని చెప్పడం కూడా ఆయనే కావడం పలు విమర్శలకు తావిస్తోంది. ఓ వైపు విచారణ జరుగుతుండగా మరోవైపు వారిని విధుల్లో చేర్చుకోమని లేఖ రాయడం వెనుక కొందరు అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

ఇద్దరు స్నేహితులను కాపాడి..!

● అసువులు బాసిన మరో మిత్రుడు
● మామండూరు వద్ద వాగులో ప్రమాదం





ప్రమాదానికి ముందు వాగులో స్నేహితులు సరదాగా తీసుకున్న ఫొటో - మృతి చెందిన హేమాద్రి

రేణిగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాగులో మునిగిపోతున్న ఇద్దరు స్నేహితులను కాపాడాడు. ఆ క్రమంలో తాను నీట మునిగి మృత్యుఒడికి చేరాడు 20 ఏళ్ల హేమాద్రి. రేణిగుంట మండలం మామండూరు వద్ద వాగులో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి(20).. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నారు. తన ఎనిమిది మంది స్నేహితులతో కలిసి గురువారం మామండూరు అతిథిగృహం వద్దకు వచ్చారు. కొంతసేపు స్నేహితులంతా సరదాగా గడిపారు. ఆ తర్వాత ఈత కొట్టడానికి సమీప అటవీ ప్రాంతంలోని వాగు వద్దకు వెళ్లారు. ఈ వాగులోకి దిగి నడుము లోతులో ఉండే ప్రాంతంలో సరదాగా నీటిలో మునుగుతూ ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులు లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లారు. ఈత రాక వారు మునిగిపోతుండడం గుర్తించిన హేమాద్రి.. తనకు ఈత రాక పోయినా తన స్నేహితులను కాపాడడానికి విఫలప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఇద్దరు స్నేహితులను కాపాడిన హేమాద్రి.. ఆ లోతు గుంతలో చిక్కుకుని మునిగిపోయారు. మిగిలిన వారు విలపిస్తూ సమీపంలోని స్థానికులను కలిసి తమ స్నేహితుడిని కాపాడాలని కోరారు. ఈ ప్రమాద సమాచారం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో మునిగిపోయిన హేమాద్రి కోసం గాలించారు. కొంతసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మత్స్యకార భరోసా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ పథకం కింద 3,786 మంది లబ్ధిదారులకు రూ.7.57 కోట్ల సహాయం అందనుందన్నారు.చేపల వేట నిషేధ కాలంలో సముద్ర మత్స్యకారుల కుటుంబాలకు రూ.10,000 పెంచి రూ.20 వేల ఆర్థిక సాయం అందించనుందన్నారు. పులికాట్ సరస్సులో చేపల వేటపై ఆంధ్ర, తమిళనాడు మత్స్యకారుల మధ్య తలెత్తిన వివాదం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆక్వా రైతులకు పవర్ సబ్సిడీపై త్వరలో మార్గదర్శకాలు వస్తాయన్నారు. పులికాట్ ముఖద్వారం వద్ద పూడిక తీత పనులకు అనుమతులు వచ్చాయని చెప్పారు. తడ, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఆక్వా, మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పులికాట్ సరస్సులో చేపలవేటపై ఆంధ్ర, తమిళనాడు మత్స్యకారుల మధ్య వివాదం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పలువురు ఆక్వా, మత్స్య రైతులకు, నేతలకు సన్మానం చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజ, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, పులికాట్ సరస్సు మత్స్యకారుల సంఘం నేత బొమ్మన శ్రీధర్, హేచరీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులను వేగవంతం చేయండి

జిల్లాలో రిజర్వాయర్ పనులను వేగవంతం చేసేలా దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బాలాజీ, మల్లెమడుగు రిజర్వాయర్ల పెండింగ్ పనులపై ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి సాగు, తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు, జీఎన్.ఎస్ఎస్ ఎస్ఈ మదనగోపాల్, తెలుగుగంగ ప్రాజెక్టు ఈఈ (వెంకటగిరి) రాధాకృష్ణమూర్తి, తిరుపతి మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం కుటుంబంపై ఆరోపణలు మానుకో



తమ తండ్రికి తమ్ముడు రామ్మూర్తితో కలిసి చంద్రబాబు క్రతువు నిర్వహిస్తున్న ఫొటోను చూపుతున్న రవి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కుటుంబంపై ఆరోపణలు చేయడం మానుకో అంటూ మాజీ సీఎం జగన్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల ఆయన పాలన చూసిన ప్రజలు అసహ్యించుకుని 11 సీట్లకే పరిమితం చేసినా సిగ్గురాలేదన్నారు. చంద్రబాబు తన తల్లిదండ్రుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారి ఇష్టానుసారమే స్వగ్రామంలో ఉంచారని చేశారు. తమ్ముడు రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు చంద్రబాబు దగ్గరుండి పూర్తిచేసిన సంగతి తెలుసుకోవాలన్నారు. సొంత చెల్లెలు, తల్లిపై కేసులు పెట్టించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో జరిగిన అవినీతిపై విచారణకు సీఐడీకి లేఖ రాశామని, త్వరలో దర్యాప్తు ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కృష్ణయాదవ్, ఆర్‌పీ శ్రీనివాసులు, సందీప్, లోకేష్, రంజిత్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి: రైతు సంఘం


ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హేమలత

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతాంగ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట ఈనెల 26న చేపట్టదలచిన మహాధర్నా విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. గురువారం పాకాలలో సీఐటీయూ నాయకులతో కలిసి మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. రైతులు, కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు సంఘమిత్రలు, వీఆర్‌ఏలు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మధుసూదన్‌రావ్, ప్రసాద్, సుగుణమ్మ, మురళి, గుణ, రాజ, ఆనంద్, రాజు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం


బాబ్జీని సన్మానిస్తున్నపద్మజరెడ్డి, టీచర్లు

పాకాల, నవంబరు 21: అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో విద్యాశాఖ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో నిరాధార వరకట్న వేధింపులు, గృహహింస కేసులతో కొందరి జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. కుటుంబంలో పురుషులపాత్ర ఎనలేనిదన్నారు. ఎంఈవో బాబ్జీ, ఉపాధ్యాయులను సన్మానించారు.

బ్రహ్మోత్సవాల్లో భద్రతపై ఎస్పీ సమీక్ష


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేర విభాగం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సుబ్బరాయుడు గురువారం సమీక్షించారు. పంచమి తీర్థం సందర్భంగా బందోబస్తుపై మాట్లాడారు. అనంతరం తిరుచానూరు ఆలయం, పుష్కరిణి వద్ద పరిశీలించారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, శాంతి భద్రతలు, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, ఎస్బీ సీఐలు శ్రీనివాసులు, విక్రమ్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల విద్య బలోపేతానికి శిక్షణా తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాముల్

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య బలోపేతం చేయడానికే ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యాముల్ చెప్పారు. మెడ్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణా తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థ నాయకత్వం ఉన్నప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలనిసూచించారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన 200మంది స్కూల్ హెడ్స్‌కు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్‌కుమార్, రాష్ట్ర పరిశీలకుడు అమ్మినాయుడు, జిల్లా అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ మధు, చంద్రగిరి మండల విద్యాశాఖాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

పీటీసీలో వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం


పోటీల ప్రారంభ కార్యక్రమంలో అధికారులు

చంద్రగిరి, నవంబరు 21: ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణీ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో వార్షిక క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ప్రారంభించారు. పీటీసీలోని సిబ్బందికి షాట్ పుట్, జావిలింగ్ త్రో, వాలీబాల్, షెటిల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభను కనబరిచిన వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీఎస్పీలు సుకుమారి, రాజగోపాల్‌రెడ్డి, సీఐలు నిరంజన్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, అంజుయాదవ్, సదాశివయ్య, మోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలయ్య, రామకృష్ణ, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థుల అవగాహనా ర్యాలీ

భాకరాపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎంపీడీవో గిడ్డయ్య మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్నారు. బహిరంగ మల విసర్జన వల్ల అపరిశుభ్రత పెరిగిపోయి అంటువ్యాధులు ప్రబలుతాయన్నారు. మండల స్థాయిలో నిర్వహణ బాగున్న మూడు మరుగుదొడ్లను ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేస్తామన్నారు కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోమశేఖర్ రెడ్డి ఎంఈఓ గోపినాథ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం వీర్వో శ్రీనివాసులు కార్యదర్శి గిరిబాబు సర్పంచ్ మనోహర స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ గిరిబాబు పాల్గొన్నారు

ఇద్దరు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్


నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సమీపంలోని ఎస్‌ఆర్.పాలెం సెక్షన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ కడప సబ్ కంట్రోల్ ఆర్‌ఐ ఎం.చిరంజీవులకు చెందిన ఆర్‌ఎస్‌ఐ పి.నరేష్, ఎఫ్‌బీఓ జి.కిరణ్‌కుమార్ బృందాలు రాజంపేట పరిధిలోని ఎస్‌ఆర్.పాలెం సెక్షన్‌లో బుధవారం తెల్లవారుజామున కూంబింగ్ నిర్వహించారు. రోళ్లమగుడు బీట్ వద్ద ఎర్రచందనం దుంగల ఇద్దరు పట్టుబడ్డారు. వారు తమిళనాడు వాసులుగా గుర్తించారు. 8 దుంగలను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేశారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. , దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు.

సౌదీ అరేబియాలో రామ్మూర్తినాయుడికి నివాళి


రామ్మూర్తి నాయుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

చంద్రగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. సౌదీఅరేబియా టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వడ్లమూడి సారథినాయుడు ఆధ్వర్యంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు మృతి టీడీపీకి తీరనిలోటు అన్నారు.. టీడీపీ ఎన్‌ఆర్‌ఐలు పోకూరి దేవరాజులు, సుదర్శన్, కుమార్, చక్రపాణి, నరేష్, చంద్రబాబు, ప్రసాద్, మురళి, నరసింహ పాల్గొన్నారు.

24న బ్రాహ్మణ సమాజ కార్తీక వన భోజనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన తిరుపతిలో బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు త్యాగరాజ మండపంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఎస్వీయూ మాజీ వీసీ రాళ్లపల్లె రామ్మూర్తి, రిటైర్డు ఏఎస్పీ రవి మనోహరాచారి, రిటైర్డు ఎస్పీ స్వామి, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొంటారు. ఏర్పాట్లపై గురువారం బ్రాహ్మణ సమాజ ప్రతినిధులు సమావేశమయ్యారు.

చంద్రగిరి

తెలంగాణ సీఎంతో టీటీడీ చైర్మన్ భేటీ



తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీటీడీ చైర్మన్ సీఎంకు పట్టువస్త్రం అందజేశారు. టీటీడీ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలిసిన బీఆర్ నాయుడిని సీఎం శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు టీటీడీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృపాసాగర్ కుటుంబ సమేతంగా వచ్చారు. ఆలయ ఏఈవో దేవరాజులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనాంతరం ఆయనను ఆలయ వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. సాయంత్రం కేంద్ర సహాయమంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి కేంద్రమంత్రిని సన్మానించారు.

మహిళల ఆరోగ్యంపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై ఎస్వీయూలో శుక్రవారం సదస్సు నిర్వహించనున్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ - హెల్త్ సెంటర్ సంయుక్తంగా శ్రీనివాసా ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం చేపట్టనున్నాయి. గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ, డెర్మటాలజిస్ట్ డాక్టర్ మంజుల, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ లక్ష్మీ, వర్సిటీ జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య పాల్గొంటారని నిర్వాహకులు మురళీధర్, డాక్టర్ వివేక్ తెలిపారు.

రాత్రి బసకేంద్రం పరిశీలన

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్నూలు వీధిలో గల రాత్రి బస కేంద్రం (నైట్ షెల్టర్)ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కేంద్రంలో కల్పిస్తున్న మౌలిక వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న పలువురిని పలకరించి సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అందించే భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట డీసీ అమరయ్య, ఎంఈ గోమతి, మెప్మా సి.ఎం.ఎం. కృష్ణవేణి, నిర్వాహకురాలు కవిత ఉన్నారు.

మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చండి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్)నవంబరు21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ మత్స్యకారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఆదిమూలం గిరిబాబు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్, అర్బన్ తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.భక్తవత్సలం, నాయకులు ఎం.అప్పలరాజు, టి.లక్ష్మీదేవి, మునిబాలసుబ్రమణ్యం, కల్యాణచక్రవర్తి,రమేష్, రాజేష్‌గాంధీ, సి.రమణ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో 'చెత్తసంపద'

- పెరుమాళ్లపల్లెలో సత్ఫలితాలు
- పంచాయతీకి ఆదాయం


వర్మీకంపోస్టుగా మారిన చెత్త


తొట్టెలో వ్యర్థాలు

తిరుపతిరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెపంచాయతీలోని చెత్త సంపద తయారీకేంద్రం ద్వారా చెత్తనుంచి సంపదని సృష్టిస్తున్నారు. తడిచెత్త ద్వారా రెండు నెలలకు ఓసారి ఒక టన్ను వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. దీనిని విక్రయిస్తూ ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. పొడిచెత్త ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆరంభం నుంచి నిరంతరాయంగా వర్మీకంపోస్టు తయారు చేస్తుండడంతో డివిజనల్ ట్రైనింగ్ కేంద్రంగా ఇది గుర్తింపు పొందింది. గతేడాది ఈకేంద్రంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కూడా నిర్వహించారు. ఇటీవల కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేసి రైతులకు వర్మీకంపోస్టు విక్రయించారు. కేజీ రూ.15చొప్పున విక్రయిస్తున్నారు చంద్రగిరిరోడ్డులోని పంచాయతీ కార్యాలయం వద్ద కూడా అమ్ముతున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూరల్‌మండలంలో 25 చెత్త సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిలో కొన్ని గత వర్షాలకు కొట్టుకుపోగా కొన్ని పాడైపోయాయి. ప్రస్తుతం 9 పంచాయతీల్లో ఇవి పనిచేస్తున్నాయి. ఇందులో పెరుమాళ్లపల్లె కేంద్రం మంచి ఫలితాలను ఇస్తోంది. చెత్త ద్వారా వస్తున్న ఈ పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. ఈ సొమ్మును జనరల్‌ఫండ్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు, అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు సర్పంచ్ జోగి మోహన్, కార్యదర్శి ఎ.మధుసూదన్ చెప్పారు.

రెండునెలలకు ఒకసారి తయారీ

తడి వ్యర్థాలను 60రోజులపాటు మగ్గించాక తొట్టెలో వేసి వర్మీని వదులుతున్నారు. ఇది 40 నుంచి 60రోజులలోపు పూర్తిస్థాయిలో వర్మీకంపోస్టుగా తయారవుతోంది. వర్మీ ఎరువు 2-10కేజీల ప్యాకెట్లుగా ప్యాక్‌చేసి రైతులకు విక్రయిస్తున్నారు. అవసరం ఉన్నవారికి పెద్దమొత్తంలో కూడా సరఫరా చేస్తున్నారు. పొడిచెత్తని కూడా వేరుచేసి అట్టపెట్టెలు, వాటర్, బీరుబాటిళ్లు వంటివాటిని విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుతున్నారు.


వర్మీకం పోస్టు విక్రయం

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టీటీడీ అధికారులకు ఈవో శ్యామలరావు ఆదేశం


వివిధ విభాగాల అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాటు చేపట్టాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఆయన గురువారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచమీతీర్థానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హోల్డింగ్ పాయింట్లలో ఉండే భక్తులకు మంచినీరు, తాగునీరు, అల్పాహారంతో పాటు మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో స్థానిక పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం అభివృద్ధికి కృషి :భానుప్రకాష్


కోదండరామస్వామి ఆలయం వద్ద నాయకులు,గ్రామస్థులతో భానుప్రకాష్‌రెడ్డి

చంద్రగిరి, నవంబరు 21: స్థానిక కోదండ రామాలయం అభివృద్ధికి కృషి చేస్తానని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన కోదండరాముడ్ని సందర్శించారు. అనంతరం గ్రామస్థులు, బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులతో మాట్లాడారు. కోదండరామాలయం ప్రహరీ గోడను నిర్మించడంతో గంగమ్మ జాతర బలి తిరగలేకపోతున్నట్లు గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఆలయ మండపానికి మరమ్మతులు చేయాలని, స్థానిక ఆలయాల బస్సు చంద్రగిరి వచ్చేలా చూడాలన్నారు. పుష్కరిణి మరమ్మతులు చేపట్టాలన్నారు. శ్రీవారి కాలినడక భక్తులకు వసతి భవనం ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు సుబ్రమణ్యం యాదవ్, మునిగంగిరెడ్డి, నరేష్‌కుమార్‌నాయుడు, టీటీఎస్ అధ్యక్షుడు ధనంజయరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నారావారిపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

- ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు


ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభిస్తున్న ఎస్పీడీసీఎల్ సురేంద్రనాయుడు

చంద్రగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో రూ.4 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందని తెలిపారు. గురువారం ఎ.రంగంపేట సమీపంలోని ఎంబీయూ వద్ద రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రాంభించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఏప్రిల్‌లోగా ఇన్‌డోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు. పెరిగిన వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని మండలంలో అత్యాధునిక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల సుమారు 7 వేల మంది వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ వాసురెడ్డి, డిఫైఈఈ శేషాద్రిరెడ్డి, ఏఈలు నాగరాజు, వెంకటరమణ, బీజేపీ నాయకుడు సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో పీసీసీఎఫ్



టాస్క్‌ఫోర్స్ పనితీరును వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

మంగళం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఎస్ఎస్ శ్రీధర్ గురువారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆయనకు స్వాగతం పలికారు. టాస్క్‌ఫోర్స్ పనితీరు గురించి పీసీసీఎఫ్‌కు ఎస్పీ వివరించారు. కూంబింగ్, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు, చెక్‌పోస్టుల పనితీరు, టాస్క్‌ఫోర్స్‌కు కావాల్సిన డ్రోన్ కెమెరాలపై చర్చించారు. సీసీఎఫ్‌సీ సెల్వం, పి.వివేక్, శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి, ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ శ్రీరవీ, ఎఫ్‌ఆర్‌వోలు మురళి, ప్రేమ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో గ్రామీణాభివృద్ధి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డు జిల్లా మేనేజర్ సునీత పేర్కొన్నారు. నాబార్డు సహకారంతో ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలోని నిరంతరం పశువైద్య విద్య, సమాచార కేంద్రం 'పాడి పరిశ్రమ - గ్రామీణ వ్యవస్థాపకత' అంశంపై ఈ నెల 11 నుంచి వర్క్‌షాప్ చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో గ్రామీణ మహిళలకు పాడి పరిశ్రమపై శిక్షణ అందించారు. పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు విలువ ఆధారిత పాల పదార్థాల తయారీపైనా అవగాహన కల్పిస్తున్నారు. నాబార్డు జిల్లా మేనేజర్ సునీత మాట్లాడుతూ విలువ ఆధారిత పాల పదార్థాలతో మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, వెటర్నరీ వర్సిటీ డెయిరీ టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ విజయగీత, డాక్టర్ రవివర్మ, మునిరత్నం పాల్గొన్నారు.

హిందీ భాషా ప్రావీణ్యాన్ని పెంచుకోవాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి ఒక్కరూ హిందీ భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర డైరెక్టర్ అంశుమాన్ ప్రసాద్ దాస్ కోరారు. తిరుపతిలో సంస్కృత యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఏ మూలనైనా జీవనం సాగించవచ్చనీ, ఉపాధి అవకాశాలు కూడా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ హిందీలో విలువైన విజ్ఞానం ఉందన్నారు. హిందీ భాషా నిపుణులు ప్రకాష్ బోర్కర్, లతా మంగేష్ హిందీ నుంచీ ఆంగ్లంలోకి అనువదించే నైపుణ్యాన్ని వివరించారు.

మాజీ సీఎం జగన్‌వి నీచ రాజకీయాలు : టీడీపీ

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ అబద్ధాల కోరని, ప్రజలు తిరస్కరించినా నీచ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ నేత, ఎమ్మార్‌పల్లి మాజీ సర్పంచ్ మమత విమర్శించారు. సీఎం చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలుతూ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గురువారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కుటుంబ సభ్యులపై జగన్ అబద్ధాలు చెప్పడం బాధాకరమన్నారు. సోదరుడు రామ్మూర్తి నాయుడితో చంద్రబాబు కలిసి తల్లిదండ్రుల అంత్యక్రియలు ఇతర కార్యక్రమాలు సజావుగా చేశారని తెలిపారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. సమావేశంలో హరిబాబు బాలయ్య, ఆనంద్, రమేష్, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి చెక్కు అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం పంచా యతీలోని చిట్లావారికండ్రిగ గ్రామానికి చెందిన యనమల ప్రియకు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షలు చెక్కును సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియ భర్త మృతిచెందడంతో బీమా సొమ్ము మంజూరు చేశామన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం : ఒకరికి స్వల్పగాయాలు


గాయపడిన మహిళ

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నందకం సమీపంలో లక్ష్మీ నారాయణ అనే హోటల్‌లో గ్యాస్ సిలిండర్ మార్చే సమయంలో మంటలు చెలరేగాయి. సమీపంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికురాలు కవిత గాయపడ్డారు. వెంటనే ఆమెను స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. సకాలంలో ఫైర్ సిబ్బంది రావడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మంటలను అదుపు చేయగలిగారు. సిలిండ్ వాల్వ్‌లో లీకేజ్ కారణంగానే మంటలు వ్యాపించాయని చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవో జయవేలు, హెచ్‌ఎం లలితకుమారి

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంఈవో జయవేలు క్రీడలను ప్రారంభించారు. 150మంది పాల్గొనగా రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు 12మంది బాలురు, 12బాలికలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి, పేరెంట్స్ కమిటీ చైనర్మన్ గిరిజమ్మ, స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాబు, పీడీ సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్నప్ప, కరుణానిధి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల విభాగంలో ఎంపికైనవారు : భానుశ్రీ,అనన్యఅక్షర, వసంతిక,సోమల), సుకన్య(నగరి), పద్మశ్రీ(కుప్పం), వర్షన(చిత్తూరు), చాందిని, వాణి(ఏర్పేడు), ధీశాలిని(నెత్తకుప్పం), రాణి(తొట్టంబేడు), గౌరిప్రియ(పూతలపట్టు) . **బాలుర విభాగం** : వసంత్(ఏకాంబరకుప్పం), గురులోకేష్(తొట్టంబేడు), మహమ్మద్ సాహిద్ (చీనేపల్లి), చరణ్ తేజ్(సోమల), రోహిత్(మొగరాల), రేవంత్(కందూరు),భువనేష్(సదుమూరు), తులసీరామ్(ఏర్పేడు), జహీర్(రొంపొచర్ల, కుశ్వంత్(నెత్తకుప్పం), ప్రణీత్(పీసీఆర్ చిత్తూరు), నితీష్(పూతలపట్టు)

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 117 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీలో తిరుపతికి చెందిన సత్యా ఇన్ఫోటెక్‌లో అసోసియేట్ ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ స్పెషలిస్ట్ ఉద్యోగాలకు గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. 190 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి ప్రతిభను పరిశీలించిన కంపెనీ నిపుణులు 117 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పద్మజ తెలిపారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.2.5 నుంచి రూ.3 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని వెల్లడించారు.

ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా సుబ్బారావు


నియామక ఉత్తర్వులు అందుకుంటున్న సుబ్బారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డీవీ సుబ్బారావు నియమితులయ్యారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


కుమారమ్మను సన్మానిస్తున్న జన సైనికులు

తిరుపతి (జీవకోన), నవంబరు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పూరిమిట్ల కుమారి (కుమారమ్మ)ని 48, 49 డివిజన్లకు చెందిన జనసేన పార్టీ ఇన్‌చార్జులు సుధా, సురేష్‌లు సన్మానించారు. వంశి, అయ్యప్ప, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి సహకరిస్తాం


మంత్రికి విన్నవిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, చిత్రంలో శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలో క్రీడారంగం అభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర క్రీడా శాఖ సహాయమంత్రి రక్షానిఖిల్‌ఖడ్సే హామీ ఇచ్చారు. తిరుమల, తిరుపతి పర్యటనకు వచ్చిన ఆమెను తాజ్‌హోటల్లో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడా రంగానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఎస్వీయూనివర్సిటీ పరిధిలో క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు. కాకినాడ, అమరావతి ప్రాంతాల్లో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(ఎన్ఎస్ఓఈ)ఏర్పాటు, తిరుపతిలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ సెంటర్(క్రీడా వసతి సముదాయం)నిర్మాణం, ఏపీలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని, క్రీడాకారులకు రైల్వే టికెట్‌లో రాయితీ కల్పించాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి అండర్ 14బేస్‌బాల్ పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంగళంలోని జిల్లా పరిషత్ ట్రెండ్స్ పాఠశాల మైదానంలో ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఇందులో రాణించిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

స్థానికులకు దర్శనం శుభపరిణామం


పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు సమర్పిస్తున్న జన సైనికులు

తిరుపతి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తూ టీటీడీ పాలక మండలి తీర్మానం చేయడం శుభపరిణామమని జనసేన జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద 500 కొబ్బరికాయలు సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినోద్‌రాయల్, ఆకేపాటి సుభాషిణి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు, దుర్గ, లత, బాబ్జి, యువరాజ్‌రెడ్డి, రాజేష్ ఆచారి, మునస్వామి, సుధా, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

షికారీలపై దౌర్జన్యాలు ఆపండి

తిరుపతి(ఆటోనగర్),నవంబరు21(ఆంధ్రజ్యోతి) తిరుమల పాప వినాశనం వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటున్న షికారీలపై అటవీ శాఖాధికారుల దౌర్జన్యాలను ఆపాలని షికారీల సంఘం నాయకుడు రాధాకృష్ణ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ పాపవినాశనం వద్ద 60 సంవత్సరాలుగా షికారీలు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అటవీ శాఖాధికారులకు అద్దె చెల్లిస్తున్నా రసీదులు కూడా ఇవ్వడంలేదన్నారు. అడిగిన షికారీలపై దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన తనపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

స్టాఫ్‌నర్సు అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో స్టాఫ్‌నర్సు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి ఈస్ట్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురానికి చెందిన 20 సంవత్సరాల యువతి ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని మారుతీ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. తోటి నర్సులతో కలిసి ఆస్పత్రి సమీపంలో గది అద్దెకు తీసుకుని ఉంటోంది. రోజూ విధులు ముగిశాక తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేది. కానీ బుధవారం ఫోన్ చేయలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి గురువారం ఆస్పత్రి వద్దకు వచ్చి విచారించారు. రెండు రోజులుగా డ్యూటీకి రావడం లేదని అక్కడి వారు చెప్పడంతో తండ్రి వెంకటేష్ తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్ హోల్స్ మార్చండి సారూ..!






ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వం ఓట్ల రాజకీయం కోసం హడావుడిగా నిర్మించిన రోడ్ల డొల్లతనం బయటపడుతోంది. నాలుక్కాళ్ల మండపం సర్కిల్ నుంచి బండ్ల వీధికి వెళ్లే మార్గంలో దాదాపు పాతికపైనే మ్యాన్ హోల్స్ ఉన్నాయి. రోడ్డుకు సమాంతరంగా వేయాల్సిన మ్యాన్ హోల్స్ నాలుగైదు అంగుళాలు పైకి లేవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులైనా మ్యాన్ హోల్స్‌ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గుంతలమయంగా ఉన్న రోడ్డు

మస్తాన్ నాయుడు కాలనీలో సమస్యల తిష్ట

- గుంతలమయంగా రోడ్డు
- ఇళ్ల మధ్యనే మురుగునీటి ప్రవాహం
- గంగ పైపులైను ఉన్నా కనెక్షన్ ఇవ్వని వైనం

తిరుపతి (జీవకోన), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని మస్తాన్ నాయుడి కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. పట్టించుకునేవారు లేక స్థానికులు అవస్థలు పడుతున్నాయి. 1వ డివిజన్ అన్నమయ్య మార్గం పక్కనే మస్తాన్‌నాయుడు కాలనీ ఉంది. కాలనీ ఏర్పడి పదేళ్లకుపైనే అవుతోంది. అయినా ఇప్పటివరకు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదు. వీధులన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి చినుకులు పడినా కూడా వీధులన్నీ జలమయం అవుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా ఇళ్ల మధ్యనే ప్రవహిస్తోంది. దుర్వాసనతో జనం ముక్కులు మూసుకుంటున్నారు. మురుగు నీరు ఇళ్లమధ్యనే ఉండటంతో దోమల బెడద అధికంగా ఉంది. ఈ కాలనీలో తెలుగుగంగ పైపులైను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటివరకు ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వకపోవడం గమనార్హం. గతంలో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని పలుమార్లు పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ఇళ్లమధ్యనే ప్రవహిస్తున్న మురుగు నీరు


కాలువలు లేకపోవడంతో ఇళ్ల మధ్యనే చేరిన మురుగునీరు

కాలువ పనులు పూర్తి చేయండి

స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో కాలువ వెడల్పు కోసమని తవ్వేసిన గుంతలను అలాగే వదిలేశారు. ఎమ్మార్‌పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ఇరువైపులా కాలువ వెడల్పు చేసేందుకు నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. విద్యా, వ్యాపార సంస్థలు విరివిగా ఉండే ఆ ప్రాంతంలో కాలువ పనులు నత్తనడకన చేయడంతో విద్యార్థులు కాలువలు దాటుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాల్లేక యజమానులు షాపులు మూసేసుకుంటున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో కాలువ వెడల్పు జరుగుతున్నాయి. టీటీడీ ప్రత్యేక దృష్టి పెట్టి కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




డ్రోన్ శిక్షణ, స్పేస్ టెక్నాలజీపై ఎంవోయూ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ శిక్షణ, స్పేస్ టెక్నాలజీపై పలు సంస్థలతో ఎస్వీయూ అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఎర్త్ నౌ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఆర్ఎఫ్ఎల్వై ఇన్నోవేషన్ కన్సార్టియం ప్రతినిధులతో ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమావేశమయ్యారు. డ్రోన్ల తయారీ, శిక్షణ, పరిశోధనలు చేపట్టడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రుసా కో-ఆర్డినేటర్లు డాక్టర్ రమాశ్రీ, డాక్టర్ ఉషారెడ్డి, సీఈవో వంశీకృష్ణ రాయల్, ఇంజినీరింగ్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

శేషాపురంలో ఎస్వీయూ విద్యార్థుల క్షేత్ర పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శేషాపురం, కందులవారిపల్లె గ్రామాల్లో ఎస్వీయూ సోషియాలజీ విద్యార్థులు, అధ్యాపకుల బృందం గురువారం క్షేత్ర పర్యటన చేసింది. గ్రామాల్లో ప్రజలకు వివిధ రకాల ఆదాయ వనరులు, వ్యయ వివరాలపై నమూనా సర్వే చేపట్టారు. దీనిద్వారా ప్రజల ఆదాయం, ఆరోగ్యం పెరిగేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టడానికి అవకాశం కలుగుతుందని క్షేత్ర పరిశీలకులు పేర్కొన్నారు. అలాగే పరిశుభ్రత, పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుసుమ, రమణ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, ముకుందనాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సాంకేతిక వినియోగం పెరగాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా గ్రంథాలయాల్లో సాంకేతిక వినియోగం పెరగాలని కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వైకుంఠం అభిప్రాయపడ్డారు. వారం రోజులుగా ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు సభలో ప్రొఫెసర్ వైకుంఠం మాట్లాడుతూ సమాజానికి గ్రంథాలయాలు జీవనాడులుగా పనిచేస్తాయన్నారు. గ్రంథాలయాలను ఈతరం సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా మంచి జ్ఞానం, వ్యక్తిత్వం, విలువలు, ఉన్నత ఉద్యోగావకాశాలులభిస్తాయని తెలిపారు. సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.తద్వారా ఉన్నతవిద్యా, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

టీటీడీ నిర్ణయాలపై హర్షం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని గాండ్ల సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం చాలా బాగుందన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు రామారావు, జ్ఞానశేఖర్, జ్యోతికుమార్, చంద్రకుమార్, సురేష్ పాల్గొన్నారు.

దుగరాజపట్నం, మన్నవరం ప్రాజెక్టులను పునరుద్ధరించండి


మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దుగరాజపట్నం ఓడరేవు, మన్నవరం బెల్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. అలాగే మన్నవరం బెల్ ఫ్యాక్టరీలో సామర్థ్యం మేరకు ఉత్పత్తులు ప్రారంభించాలని కోరారు. దేశ రాజధాని ఢిల్లీ నిర్మాణానికి 17వేల ఎకరాలు తీసుకున్నారని, ఏపీలో రాజధానికి 50వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. తిరుపతి జిల్లావాసిగా ఉన్న చంద్రబాబు సొంత జిల్లాను వదలి గుంటూరులోని అమరావతిని రాజధానిగా చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పోలవరం నిర్మాణానికి 9 శాతం వడ్డీతో 11 వేల కోట్లు రుణం తీసుకుని 2027లోపు ఎలా పూర్తి చేస్తారో వివరించాలని కోరారు. టీటీడీ ఉద్యోగులకు అలిపిరి పేరూరు మధ్యలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. స్విమ్స్‌లో స్థానికులకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యార్లపల్లి గోపి, వేంకటేశ్వర్లు, తేజోవతి, మునిశోభ, వేణు పాల్గొన్నారు.

పార్కులను శుభ్రంగా ఉంచండి


వినాయకసాగర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి,(జీవకోన), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్న పార్కులను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. గురువారం వినాయక సాగర్‌లో పారిశుధ్య పనులను, తాగునీటి సాంద్రత పరీక్షలను పరిశీలించారు. సాగర్‌లో నీటిపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలన్నారు. వాకింగ్ ట్రాక్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వాకర్స్ తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తనిఖీల్లో ఎస్ఈ శ్యాంసుందర్, ఎం.గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు



తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నేతల బృందం షిరిడీకి వెళ్లి మొక్కులు తీర్చుకుంది. చంద్రబాబు సీఎం కావాలని ఎన్నికల ముందు గత ఏడాది ఇదే నెలలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో పార్టీ నేతలు షిరిడీలో వేడుకున్నారు. అనుకున్నట్టే కూటమి ప్రభుత్వం రావడంతో గురువారం షిర్డీ సాయిబాబా సన్నిధికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందించాలని షిరిడీ సాయినాథుని కోరుకుని మొక్కులు తీర్చుకున్నారు. షిర్డీ యాత్రలో ఆర్సీ మునికృష్ణతో పాటు నాయకులు మహేష్ యాదవ్(మక్కి యాదవ్), జయరామిరెడ్డి, రవిశంకర్ యాదవ్ (సుబ్బు యాదవ్)ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, జిమ్ ప్రకాష్, రూపేష్, శరత్, నాగప్రతాప్, రవితేజనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రమణలు పాల్గొన్నారు.

ప్రజల్ని, ప్రకృతిని వంచించిన జగన్ ప్రభుత్వం

వంచన పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు ప్రకృతినీ గత వైసీపీ ప్రభుత్వం వంచించిందని, వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన పరిశోధకుడు డాక్టర్ డి.ఉదయకుమార్ రచించిన వంచన పుస్తకాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సౌజన్యంతో కుప్పం తెలుగుదేశం పార్టీ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం అసెంబ్లీలోని సీఎంవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని, ఆర్థిక విధ్వంసాన్ని, పాలనా వైఫల్యాలను, అణగారిన వర్గాలపై జరిగిన దౌర్జన్యాలను, మహిళలపై అమానుష దాడులను, భూకబ్జాలను వివరిస్తూ 54 పరిశోధనాత్మక శ్వేతపత్రాలుగా రచించి.. వంచన పేరుతో డాక్టర్ ఉదయ్ వెలువరించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ, కంచర్ల శ్రీకాంత్,ఎమ్మెల్యే మురళీమోహన్, అమరావతి పబ్లిషర్స్ అధినేత సూర్నేని మోహన్ నాయుడు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.





బోట్లలో వెళ్లి బాధితులను కాపాడుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

వరదల్లో చిక్కుకుంటే..!

భారీ వర్షాలు. అకస్మాత్తుగా వరదొచ్చింది. ఎందరో నీటిలో మునిగిపోతున్నారు. అంతలో ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. లైఫ్ జాకెట్లు వేసుకుని, బోట్లలో నీళ్లలోకి వెళ్లారు. మునిగిపోతున్న వారిని కాపాడి.. ఒడ్డుకు చేర్చారు. సీపీఆర్ చేశారు. ప్రాణాలను కాపాడారు. ఇదంతా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పెద్దన్న చెరువులో గురువారం మాక్‌డ్రిల్. వరదలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? నీటిలో చిక్కుకొన్న వారిని ఎలా రక్షించాలి? లైఫ్ జాకెట్లు వేసుకుంటే నీటిలో ఎంతవరకు ఉండొచ్చు.. వంటి అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుమన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎస్వీ నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, కోటపోలూరు సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



కాపాడిన వారిని బయటకు తీసుకొస్తున్న సిబ్బంది


మాక్ డ్రిల్‌లో పాల్గొన్న వారు

పల్లెపల్లెనా బెల్టు షాపుల జోరు

పగలు రూ.10 నుంచీ రూ.20 అదనం

రాత్రిళ్లు రూ.30 నుంచీ 150 దాకా అధికం

తెగ తాగిస్తున్నారు!



- మద్యం షాపులకు అనుబంధంగా అనధికారిక గదులు

మద్యం అక్రమ వ్యాపారానికి 'బార్లు' తెరిచారు. దుకాణాల పక్కనే అనధికార గదులు.. పల్లెల్లో బెల్టు షాపులు పెట్టి తెగ తాగిస్తున్నారు. కొన్ని చోట్ల మందు బాబుల సిట్టింగ్‌కు సదుపాయాలు కల్పించారు. మరికొన్నింటికి కూల్ డ్రింక్ షాపుల పేరిట బోర్డులు పెట్టి లోపల మద్యం తాగిస్తున్నారు. బెల్టు షాపుల్లో టైమింగ్‌ను బట్టి అదనపు ధరలు మారుతుంటాయి. ఎక్సైజ్, పోలీసు శాఖలు స్పందించకపోవడంతో నామమాత్రపు కేసులకే పరిమితమవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి: పోటాపోటీగా అనుబంధ గదులు

తిరుపతిలో 24 మద్యం షాపులకు అనుబంధంగా మందుబాబులు తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. వీటికి తోడు 18 బెల్టు షాపులున్నాయి. రూరల్‌లో 12 మద్యం షాపులకూ సమీపాల్లో తాగేందుకు గదులు ఏర్పాటు చేశారు. పక్కనే కూల్ డ్రింకు షాపుల్లోనూ తాగిస్తున్నారు. రూరల్ మండలంలో 17 బెల్టు షాపులున్నట్టు అంచనా. పగలు క్వార్టర్‌పై రూ.10-20 వరకూ.. రాత్రి పది నుంచీ ఉదయం పది మధ్య బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ రేటు పెంచి విక్రయిస్తున్నారు.

రేణిగుంట: రాత్రిళ్లు ధరల ఘాటు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో.. తొమ్మిదింటి వద్ద అనధికార గదుల్లో మద్య తాగిస్తున్నారు. రాత్రిళ్ళు షాపులు మూతపడ్డాక మాత్రం అనధికారిక మద్యం అధిక ధరలతో ఘాటెక్కుతోంది. బాటిల్‌పై రూ. 50 నుంచీ రూ. 150 దాకా పెంచి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా నడుస్తున్నాయి. ఉదాహరణకు.. అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఒకే మహిళ రెండు సార్లు గాజులమండ్యం పోలీసులకు పట్టుబడింది.



శ్రీకాళహస్తి బస్టాండు ఎదురుగా మద్యం షాపు పక్కనే తాగించడానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: సకల సదుపాయాలు

శ్రీకాళహస్తిలోనూ పదింటికి గాను 9 షాపుల పక్కనే అనుబంధ గదుల్లో మందుబాబులకు సకల సదుపాయాలు కల్పించారు. మరో షాపునకూ మరో నాలుగైదు రోజుల్లో అనధికార గదిని అందుబాటులోకి తెచ్చేలా సిద్ధం చేస్తున్నారు. దుకాణాలు మూసేశాక దొంగచాటు అమ్మకాలతో ధరలు పెంచుతున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రెండు వారాల కిందట పానగల్ రైల్వే గేట్ సమీపంలో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు.

నాగలాపురం: అనధికారిక బార్లు



నాగలాపురంలో బహిరంగంగానే అనధికార బార్లు

నాగలాపురంలో రెండు, సురుటిపల్లి, టీపీ కోటల్లో ఒక్కొక్కటి చొప్పున మండలంలో నాలుగు లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వాటి పక్కనే అనధికారికంగా బార్లు నడుస్తున్నాయి. బహిరంగంగానే వీటిని నిర్వహిస్తుండడం విశేషం. నందనం గ్రామంలోని బెల్టు షాపులో బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు. ఈ షాపుపై పోలీసులు కేసు నమోదు చేసినా మళ్లీ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.

డక్కిలి: బారుల్లా కూల్ డ్రింక్ షాపులు

డక్కిలి, మోపూరు రోడ్డు, దగ్గవోలు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు లైసెన్సుడ్ షాపులున్నాయి. డక్కిలి షాపు దగ్గరగా నాలుగైదు కూల్ డ్రింకు షాపులున్నాయి. మిగిలిన షాపుల పక్కనే ఒకటి రెండు చొప్పున కూల్ డ్రింకు షాపులు ఏర్పాటయ్యాయి. ఆ షాపుల్లోనే మందు బాబులు సిట్టింగ్ వేసి తాగుతున్నారు. దీని కోసం కూల్ డ్రింకు షాపు నిర్వాహకులు మద్యం షాపు వారికి రోజుకు రూ. వెయ్యి నుంచీ రూ. 1500 చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అంటే, మందుబాబులు తాగేందుకు వీరు 'ప్రత్యేక ఛార్జీ' వసూలు చేస్తున్నారు. ఇక, బెల్టుషాపుల్లో బాటిల్‌పై పగలు రూ.20-30.. రాత్రిళ్ల రూ.50 ఎక్కువ ధరతో అమ్ముతున్నారు.



డక్కిలిలో వైన్‌షాపు పరిసరాల్లో కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

బెల్టుషాపులకు 'కోట'

జిల్లాలోనే అత్యధికంగా బెల్టు షాపులు కోట మండలంలో ఉన్నాయి. ఏడు లైసెన్స్‌డ్ షాపుల్లో.. కొన్నింటి పక్కన మద్యం తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. ఇక, 21 పంచాయతీల పరిధిలో 150 దాకా బెల్టు షాపులున్నాయి. వీటిల్లో బాటిల్‌పై రూ.50 నుంచీ రూ. 70 చొప్పున అధిక ధరతో విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్, పోలీసు దాడులు, తనిఖీలు లేవిక్కడ.

ఎక్సైజ్ గుర్తించిన బెల్టు షాపులే 930

జిల్లాలో 227 లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వీటిలో 182 దుకాణాలకు అనుబంధంగా గదులున్నట్టు అంచనా. ఇక, 930 బెల్టు షాపులున్నాయని ఎక్సైజ్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం దుకాణాల నుంచే కాకుండా తమిళనాడు నుంచీ చీప్ లిక్కర్ తెచ్చి అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. గత 15 రోజుల వ్యవధిలో ఎక్సైజ్ అధికారులు 35 కేసులు నమోదు చేసి 52 మందిని అరెస్టు చేయడంతో పాటు 430 క్వార్టర్ బాటిళ్ల సీజ్ చేశారు. దీన్నిబట్టి జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

దొరవారిసత్రం: బెల్టుకు వేలం

దొరవారిసత్రం మండలంలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలు రెండూ వైసీపీ అనుకూల వ్యక్తులకు దక్కాయి. అధికార పార్టీ నాయకులకు భయపడి వారు బెల్టు షాపుల జోలికి వెళ్లడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికార పార్టీ నాయకులు కొందరు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపులకు సూళ్లూరుపేటలో టీడీపీ కీలక నేత పరిధిలోని నాలుగు దుకాణాల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల శ్రీధనపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏకంగా వేలం పాటలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ వేలంలో ఓ వ్యక్తి రూ. 1.60 లక్షలకు షాపు దక్కించుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఎక్సైజ్, పోలీసు యంత్రాంగాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. దీంతో బెల్టు షాపులకు మద్యం సరఫరా తాత్కాలికంగా ఆగింది. వేడి తగ్గగానే 45 బెల్టు షాపుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

అన్ని చోట్లా ఇలానే..

- చంద్రగిరి మండలంలో 7 మద్యం షాపులుంటే 16 మంది అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఒక షాపు నిర్వహణ తీసుకున్నారు. వారే బెల్టు షాపులకు తెర లేపారని సమాచారం. మండలాన్ని రెండుగా విభజించి ఒక్కో ప్రాంతానికి ఇద్దరేసి నాయకులు బెల్టు షాపుల దందా నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. చంద్రగిరిలో ఓ షాపు పక్కనే అనుబంధ గది ఏర్పాటు చేయగా, పోలీసులు తనిఖీ చేసి హెచ్చరించారు. కొన్ని చోట్ల షాపుల కోసం గదులు అద్దెకు ఇచ్చిన యజమానులే వాటి పక్కన కూల్ డ్రింక్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్యం షాపులో కంటే బాటిల్‌పై రూ.10, రూ. 20 అదనపు ధరతో విక్రయిస్తున్నారు. మండలంలో 20 బెల్టు షాపులున్నాయని అంచనా.
- పాకాలలో ఐదు షాపులుంటే 27 మంది రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మండలంలో పదిహేను వరకూ బెల్టు షాపులున్నాయి. క్వార్టర్ మీద రూ. 10 నుంచీ రూ. 15 వరకూ అదనం.
- చిన్నగొట్టిగల్లు మండలంలో మూడు వైన్ షాపులున్నాయి. ఈ షాపుల్లో మద్యం కొని కొందరు బాటిల్‌పై రూ. 20 నుంచీ రూ. 50 దాకా ధర పెంచి గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. 13 గ్రామాల్లో ఇలాంటి ఏర్పాట్లున్నాయి.
- నాయుడుపేట మండలంలో 13 షాపుల పక్కనా అనధికారిక గదులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో 20 బెల్టు షాపులున్నట్టు అంచనా. వీటిల్లో బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ ధరలు పెంచి అమ్ముతున్నారు. బెల్టు షాపుల ఏర్పాటు వెనుక నాయకుల ప్రమేయం ఉంది.
- పెళ్లకూరు మండలంలో రెండు షాపులున్నాయి. ఇక, బెల్టు షాపులపై స్థానికుల ఫిర్యాదుతో తాళ్వాయిపాడు గ్రామంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు తనిఖీలు చేసి ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.
- గూడూరులో 12 షాపులున్నాయి. వీటిల్లో పలువురు మద్యం కొని.. గ్రామాల్లో బాటిల్‌పై రూ.50 పెంచి విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎక్సైజ్ పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మూడు షాపుల వద్ద మాత్రం పక్కనే కూల్ డ్రింకు షాపులు వెలిశాయి. వాటిలో మద్యం విక్రయిస్తున్నారు.
- వాకాడు మండలంలో నాలుగు మద్యం దుకాణాల పక్కనా కూల్ డ్రింకు షాపులు పెట్టారు. గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం షాపులన్నీ సిండికేట్‌గా మారాయని, నిర్వాహకులే బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.50-80 అదనంగా విక్రయిస్తున్నారు.
- చిల్లకూరు మండలంలోని 6 షాపుల పక్కనా అనధికారిక షాపులు ఏర్పాటయ్యాయి. బాటిల్‌పై రూ. 50 పెంచి అమ్మేస్తున్నారు.
- చిట్టమూరు మండలంలో నాలుగు దుకాణాల పరిధిలోని గ్రామాల్లోనూ బెల్టు షాపులు నడుస్తున్నాయి. బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- బాలాయపల్లి మండలంలో మూడు మద్యం షాపుల పక్కనా అనధికారిక బార్ రూమ్‌లు వెలిశాయి. ప్రతి గ్రామంలో రెండు చొప్పున బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి.
- వెంకటగిరిలో తొమ్మిది షాపుల పక్కనే ఒక్కో కూల్ డ్రింక్ షాపు కొలువు దీరాయి. వీటిల్లోనే మందు బాబులు మద్యం తాగుతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు సరేసరి. ఇటీవలే ముదంపల్లిలో బెల్టు షాపును గుర్తించి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదుచేశారు.
- పుత్తూరులో ఏడు షాపుల వెనుక మద్యం తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓ వైసీపీ నాయకుడు విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుపుతుండగా.. అతడికి అధికార పార్టీ నాయకులు సహకరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఐదు లైసెన్సుడ్ షాపుల పక్కన అనధికారిక గదుల్లో మద్యపానం నడుస్తోంది. 15 గ్రామాల్లో బెల్టు షాపులుండగా, అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో వైన్‌షాపు పక్కనే తాగడానికి ఏర్పాట్లు

కేవీబీపురం మద్యం దుకాణం వెనుకవైపు ఎంచక్కా పందిరి వేసి, టేబుళ్ల తరహాలో బండలు అమర్చి మద్యం తాగడానికి ఏర్పాటు చేశారు.



కేవీబీపురంలో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో మందు బాబుల కోసం బండలతో టేబుళ్ల తరహాలో వేశారిలా

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాజ్‌కుమార్(30) అనే సచివాలయ ఉద్యోగి మృతి చెందారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. రేణిగుంటకు చెందిన రాజ్‌కుమార్ శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని నాయుడుపేట-తిరుపతి జాతీయ రహదారి దాటి అవతలి వైపు వెళుతుండగా తిరుపతి నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూరాజ్‌కుమార్ అక్కడ మృతి చెందారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్క్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

బీర్ల లారీ బోల్తా

బీర్ల లారీ బోల్తాపడిన ఘటన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పాండిచ్చేరి నుంచి 1800 కేసుల బీరు బాటిళ్ల లోడుతో వైజాగ్‌కు ఓ లారీ బుధవారం బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున తడ మండలం అక్కంపేట సమీపంలోకి వచ్చేసరికి వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తాపడింది. డ్రైవర్ కన్నన్‌సేతుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సురేష్, కోటేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీలో ఉన్న బీరు కేసులన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. బీర్ల లారీ బోల్తా పడిందని తెలిసి చుట్టుపక్కల వాళ్లు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే పోలీసులు అక్కడకు చేరుకొని వారిని తరిమేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, లారీని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

- తడ, ఆంధ్రజ్యోతి



ఆర్‌ఆర్‌బీ పరీక్షలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగనున్న ఆర్‌ఆర్‌బీ అర్హత పరీక్షల అభ్యర్థుల కోసం ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-సికింద్రాబాదు, కరీమ్‌నగర్-కాచిగూడ, కాచిగూడ-కర్నూలు సిటీ, హుబ్లీ-కర్నూలు సిటీ, నాందేడ్-తిరుపతి, కాకినాడ టౌన్-తిరుపతి మధ్య రైళ్లు నడుపుతామని తెలిపారు.

- నాందేడ్-తిరుపతి మధ్య 23న ప్రత్యేక రైలు(07105) నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి ముడికేడ్, ధర్మాబాదు, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్డు, పాకాల స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతిలో ప్రత్యేక రైలు (07106) 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు 8.35 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.
- కాకినాడటౌన్‌లో 23వ తేదీ ప్రత్యేక రైలు(07107) ఉదయం 6.30 గంటలకు బయలుదేరి సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, న్యూగుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, బిట్రగుంట, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా అదే రోజు సాయంత్రం 6.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.
- తిరుపతిలో 24వ తేదీ ప్రత్యేక రైలు(07108) రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాకినాడటౌన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 23, 24 తేదీలతో పాటు 26, 28, 29 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

రూ.300 దర్శన టికెట్లు 25న విడుదల

తిరుమల, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు ఈ కోటాను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేస్తారు.అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో ఖాళీలను కూడా విడుదల చేస్తారు. మరోవైపు 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణిట్రస్టు టికెట్లు జారీ చేయనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 59,231 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

సైబర్ ఉచ్చులో ఎరువుల వ్యాపారి

- నిమిషాల వ్యవధిలో రూ 13.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి తిరుపతికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి రూ.13.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువుల వ్యాపారి (మార్కెటింగ్) జయరామిరెడ్డికి తిరుపతిలో ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా ఉంది. అకౌంటు వుంది. ఈయన ప్రమేయం లేకుండానే 'పీఐపీ ఈ7 ఇన్వెస్ట్‌మెంట్ అలియన్స్ లెర్నింగ్' వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయ్యారు. ఈ గ్రూప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశారు. అప్పుడు ఆయన మొబైల్‌లో ఫేక్ 'సీడబ్ల్యూఏ మ్యానేజ్' యాప్ కూడా డౌన్‌లోడ్ అయింది. అందులో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అనంతరం అతడి ఖాతాలో రూ.24.3 లక్షలు కనిపించాయి. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయబోగా యాప్ కనిపించకుండా పోయింది. తాను మోసపోయాయని తెలుసుకున్న ఆయన.. రూ.13.5 లక్షలు నష్టపోయినట్లు తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



నారాయణవనం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ రవీంద్ర కథనం మేరకు.. గురువారం ఎస్ఐ రాజశేఖర్, తమ సిబ్బంది మండల పరిధిలోని పాలమంగళం నార్త్‌కు వెళ్లే దారి వద్ద తనిఖీలు చేపట్టారు. మండలంలోని మిట్టనైనారుకండ్రిగ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ అనుమానుస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 2 కిలోల వంద గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అతడిని తహసీల్దార్ సమక్షంలో అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠ

సత్యవేడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడు గ్రామంలో నిర్మించిన మరగదాంబిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మరగదాంబిక రామలింగేశ్వరస్వామితో పాటు నవగ్రహాలు, కాలభైరవుడు, దుర్గాదేవి, దక్షిణామూర్తి తదితర దేవతామూర్తులు, గ్రామ దేవతతో సహా 21 కలశాలను ఆలయ మండపం లో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, మురుగయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఇళ్లకు దారి వసతి కల్పించండి



సత్యవేడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం కస్తూరి నాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న కొందరు గిరిజనులు తమ ఇళ్లకు దారి వసతి కల్పించాలని తహసీల్దార్ హనుమాన్ నాయక్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తమ ఇళ్ల ఎదుట అదే పంచాయతీకి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ మహిళ అధ్యక్షురాలికి కొంత స్థలం ఉందని, ఆ స్థలంలో తైలం చెట్లుసాగు చేసుకునేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో తమ ఇళ్లముందు ఉన్న స్థలాన్ని సైతం ఆక్రమించుకుని ఇళ్లకు దారి లేకుండా పూర్తిగా ఫెన్సింగ్ వేశారని విచారం వ్యక్తం చేశారు. వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి దారి కల్పించాలని విన్నవించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన ఘటన గురువారం శ్రీకాళహస్తీశ్వ రాలయం సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి ముక్కంటి ఆలయం సమీపంలో కొంతకాలంగా సంచరించేవాడు. అనారోగ్యంతో స్వర్ణముఖి నదిలోని భక్తకన్నప్ప వంతెన కింద మృతి చెందాడు. 1టౌన్ పోలీసులు అతడి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాయితీ పీవీసీ పైపుల కోసం

డీడీలు కట్టిన రైతులకు న్యాయం చేయండి

పిచ్చాటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 2014-19 టీడీపీ అధికారంలో ఉండగా చివరి ఏడాదిలో 60 శాతం సబ్సిడీపై పీవీసీ పైపుల కోసం రైతులు 40 శాతం నగదును డీడీల రూపంలో చెల్లించారు. వ్యవసాయ అధికారులు అప్పట్లో కొందరికి ఇచ్చారు. పలువురికి పైపులు ఇవ్వలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని పట్టించుకోలేదు. ఫలితంగా డీడీలు కట్టిన రైతులు నష్టపోయారు. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పీవీసీ పైపులు అందించాలని డీడీలు కట్టిన రైతులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యాలయాల తనిఖీ



రేణిగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోనితూకివాకం, గాజులమండ్యం పంచాయతీ కార్యాలయాలను జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వర్ణ పంచాయతీ పనుల డేటాపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభురావ్, పంచాయతీ కార్యదర్శులు బాలాజీ యాదవ్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం తమిళనాడుకు మూగజీవాలు



కేవీబీపురరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురం మండలం నుంచి ప్రతి రోజూ మూగజీవాలు తమిళ నాడుకు తరలుతున్నాయి. వ్యాపారులు కనీసం పర్మిట్లు లేకుండా తమిళనాడుకు తరలిస్తున్నారు. అధికారులు స్పందించి మూగజీవాలు కబేళాలకు తరలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రాంగణంలో రెండోరోజైన గురువారం గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల జోనల్‌మీట్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, కళాశాలలకు చెందిన 680 మంది బాలురు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. గురువారం వాలీబాల్, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి. హ్యాండ్‌బాల్ పాఠశాల బాలుర విభాగంలో చిల్లకూరు విద్యార్థులు మొదటిస్థానం సాధించి విజేతలుగా నిలవగా, కోట విద్యార్థులు రెండవస్థానం సాధించారు. కళాశాల హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో కోట జట్టు మొదటిస్థానంలో నిలవగా, చిల్లకూరు జట్టు రెండవస్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరేష్, రాజ్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఆయా జిల్లాలకు చెందిన 17 జట్లు హోరాహోరీగా క్రీడలు ఆడుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఎరువుల దుకాణాలను గురువారం గూడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.గోపీ నాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు ఉన్నా చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ఏవోలు కవిత, జ్యోతిర్మయి, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



కోట, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): కోట పట్టణంలో గురువారం అయ్యప్పగ్రామోత్సవం జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అయ్యప్పభక్తులు స్థానిక సోమేశ్వర ఆలయంలో పూజలు చేసి, అయ్యప్ప విగ్రహంతో గాంధీబొమ్మ సెంటర్‌నుంచి బజారుమీదుగా గోపాల్ రెడ్డి విగ్రహం వరకు మేళతాళాలతో అయ్యప్ప గ్రామోత్సవం జరిగింది. అయ్యప్ప ఊరుగుతున్న సమయంలో భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అయ్యప్పను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



చిల్లకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవ కొండలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు. భక్తులు చెల్లించిన కానుకలు 16నెలలకు గాను రూ.3,28,013 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు, ఈవో రవికుమార్, సురేంద్రరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, గ్రామస్థులు, సేవకులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన క్రీడా వికాస భవనం

- కూటమి ప్రభుత్వంపైన

ఆశలు పెట్టుకున్న క్రీడాకారులు



గోడల వరకు కట్టి వదిలేసిన క్రీడా వికాస భవనం - 2018లో ఎమ్మెల్యే పాశం ఆవిష్కరించిన శిలాఫలకం

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంత మండలాల్లోని క్రీడాకారులకు ఆయా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు పంపించాలన్న లక్ష్యంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రం కలగా మిగిలిపోయింది. కోట పట్టణంలో 2018 డిసెంబరులో రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు భవన నిర్మాణం, మెటీరియల్‌కు రూ2 కోట్లు విడుదల చేసింది. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో అప్పటి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతులమీదుగా శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారు. శాప్ అధికారుల పర్యవేక్షణలో పనులు పొందిన కాంట్రాక్టర్ ఆఘమేఘాలపై భవన నిర్మాణపనులు చేపట్టి గోడల వరకు నిర్మాణాలు జరిపి ఆ తరువాత బిల్లులు చెల్లించుకొని గిట్టుబాటు కాలేదని చేతులు ఎత్తేశారు. అటు తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ క్రీడా శిక్షణ భవన స్థితిగతులను పట్టించుకోలేదు. అప్పటి ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా పెడచెవిన పెట్టారు. దీంతో నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ క్రీడా భవనం మిగిలిపోయింది. ఈ భవన నిర్మాణం పూర్తయి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కోట, వాకాడు, చిట్టమూరు మండలాల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి క్రీడలపై ఆసక్తి పెంచవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కోట ప్రాంతంలో ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటైతే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టి సారించి ఈ భవనానికి మోక్షం కలిగిస్తే క్రీడాకారుల చిరకాల కోరిక నెరవేరుతుంది.

క్రీడా భవన నిర్మాణ పనులు వేగవంతం

- పాశం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

కోటలో ఆగిపోయి ఉన్న క్రీడా భవన నిర్మాణ పనులపై దృష్టిపెట్టా. ఇందుకోసం శ్యాప్ ఛైర్మన్‌ను కలిశా. మరిన్ని నిధులు తీసుకువచ్చి ఈ శిక్షణ భవనాన్ని నిర్మించి మూడు మండలాల గ్రామీణ క్రీడాకారులకు అంకితం చేస్తా.

ఏటీఎంలలో భద్రత డొల్ల



తడ కెనరా బ్యాంక్ వద్ద, సూళ్లూరుపేట జూనియర్ కాలేజీ ఎదురుగా, నాయుడుపేట పాత వెంకటగిరి రోడ్డులో ఉన్న ఏటీఎంలకు బుధవారం రాత్రి భద్రతా సిబ్బంది లేని దృశ్యం

నాయుడుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలలో భద్రత డొల్లతనం బయటపడింది. ఏ ఏటీఎం చూసినా కనీస సిబ్బంది లేకపోవడం గమనార్హం. బుధవారం రాత్రి సమయంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పలు ఏటీఎంలను ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది. ఎక్కడా భద్రతా సిబ్బంది కనబడలేదు. ఏటీఎంలను గడ్డపారలతో పగులగొడుతున్నా బ్యాంక్ అధికారుల్లో చలనం కనబడటం లేదనేందుకు ఈ చిత్రాలే ఉదాహరణగా చెప్పవచ్చు. రహదారులలోనే ఇలా చోరీలకు ప్రయత్నాలు జరుగుతున్నా వారికి చీమకుట్టినట్లయినా లేదని, ఇకనైనా ఆయా ఏటీఎంలకు భద్రతా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుత్తూరు వార్తలు

కబ్జా చేసి..ఇల్లు కట్టేసి

కుంట పోరంబోకు స్థలంలో వైసీపీ నేత నిర్మాణం
- నిద్రావస్థలో రెవెన్యూ వ్యవస్థ



కుంట పోరంబోకు స్థలంలో విలాసవంతమైన భవన నిర్మాణం

పుత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పుత్తూరు మండల పరిధిలో ప్రభుత్వ భూములే కాదు.. కుంట పోరంబోకు స్థలాలను సైతం ఆక్రమించేశారు. తమను అడిగేవారే లేరంటూ నిర్మాణాలు సైతం చేపట్టారు. కేబీఆర్ పురం పంచాయతీ పరిధిలోని దిగువ ఇప్పగుంటలో సర్వే నెంబర్ 128/2లో 2.08 ఎకరాల కుంట పోరంబోకు స్థలం ఉంది. ఇందులో 2 ఎకరాల కుంట పోరంబోకు స్థలం అన్యాక్రాంతమైంది. ఈ స్థలంలో వైసీపీ నాయకుడు అన్నా లోకనాథం భవనం నిర్మించాడు. అలాగే గత ప్రభుత్వ పాలనలో వైసీపీ సానుభూతిపరులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇదే ప్రాంతంలో గాలేరు - నగరి కాలువ స్థలం కూడా ఆక్రమణకు గురైంది. బఫర్ జోన్ ఆక్రమించి దుకాణం ఏర్పాటు చేశారు. ఆక్రమిత స్థలాల విలువ దాదాపు రూ.75 లక్షలు వరకు ఉంటుంది.



గాలేరు - నగరి కాలువ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం

తమవంతు సహకరించిన రెవెన్యూ శాఖ

గ్రామకంఠంగా ఉన్న ఇంటి స్థలానికి వైసీపీ నాయకుడు ఎన్‌వోసీ తీసుకుని నిర్మాణాలు చేపట్టాడు. గ్రామకంఠం స్థలానికి ఎన్‌వోసీ జారీ చేసి రెవెన్యూ అధికారులు తమవంతు సహకరించారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాలను తొలగించి కుంటను రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తాం

కుంట పోరంబోకు స్థలం ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. నాలుగేళ్ల ముందు నిర్మాణాలు జరిగినట్లు తెలుస్తోంది. అప్పటి తహసీల్దార్ జయరాం ఆధ్వర్యంలో ఎన్‌వోసీ తీసుకుని నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు అందాయి. కుంట పోరంబోకు స్థలంలో నిర్మాణాలు జరిగినట్లు తేలితే నోటీసులు జారీచేస్తాం. ఆ నిర్మాణాలను తొలగింపునకు చర్యలు చేపడతాం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే విజయశ్రీ



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. గురువారం సాయంత్రం శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును విజయశ్రీ కలసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వినతిపత్రం రూపంలో ముఖ్యమంత్రికి అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వైద్యఖర్చులకు ఆర్థిసాయం



నగదు అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో రమేష్‌బేకరి అధినేత రమేష్ సహకారంతో స్థానిక రామమందిరంలోని పూజారి నాగేశ్వరశర్మ కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న నాగేశ్వరశర్మ కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం తమ సంస్థ ఆధ్వర్యంలో నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మురళీ నాయుడు, రాము, ప్రభాకర్‌కుమార్ నాయుడు, పి.శ్రీనివాసులు, శ్రీహరి కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోండి



కోచింగ్ సెంటర్‌పై ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): కోచింగ్ పేరుతో విద్యార్థులను మోసం చేసిన బాసర డీఎస్సీ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఓబులయ్యకు ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ పుత్తూరులో జెండామాను వీధిలో ఉన్న బాసర డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కోచింగ్ కోసం వచ్చిన వారి నుంచి రూ. 5 వేల నుంచి రూ. 15 వేలు డబ్బులు కట్టించుకున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ తేదీలు మార డంతో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తరగతులు ప్రారంభించకుండా మాట దాట వేస్తున్నారని తెలియజేశారు. డబ్బులు కట్టిన యువత వారం రోజులుగా కోచింగ్ వద్దకు వెళ్లగా సెంటర్‌కు తాళాలు వేసి ఉందని, నిర్వాహకులకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోందని పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

పుత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూమి మీద మూడోవంతు ఉండాల్సిన చెట్లు మానవుని అత్యాశకు బలై ఇరవై శాతం కూడా లేవని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పేర్కొన్నారు. కళాశాల ఆవరణంలో వృక్షశాస్త్ర విభాగం, ఇకోక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఎర్రచందనం, రోజ్‌వుడ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల వల్ల వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు పర్యావరణం బాగుంటుందని వివరించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, పద్మావతి, సుజన పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి



నారాయణవనం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను డీలర్లు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఏవో శోభారాణి సూచించారు. గురువారం ఆమె మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణ దారుల నుంచి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎప్పటికప్పుడు వైద్య సేవలందించాలి



వడమాలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు అనారోగ్యాలకు గురైతే వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలకు వెళ్లి సేవలందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్యాధికారి హర్షవర్ధన్ సూచించారు. గురువారం మండలంలోని వడమాలలో వెల్నెస్ కేంద్రాన్ని టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎస్‌వో నాగేంద్రకుమార్, డీపీవో ప్రకాష్, ప్రాథమిక వైద్యాధికారి చక్రపాణి, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో

శ్రీవారి డైరీలు, క్యాలెండర్ల విక్రయం



నారాయణవనం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో శ్రీవారి డైరీలు, క్యాలెండర్లు విక్రయిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

వెంకటేశ్వర దాసరి ఇళ్లకు ఇంటి పట్టాలివ్వండి

పుత్తూరు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తడుకు పంచాయితీ వెంకటేశ్వర దాసరి ఇళ్లకు పట్టాలివ్వాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పట్టాలిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు నందయ్య, గ్రామస్తులు మురళి, వెంకటస్వామి, వెంకటరాజన్న, మురగమ్మ, యశోద, శైలజ, చందు, కావేరి పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో ఖాతాల కోసం ప్రత్యేక క్యాంప్‌లు

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పోస్టాఫీసుల్లో కొత్తగా ఖాతా తెరవడానికి ఈ నెల 26 నుంచి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నామని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, పోస్టల్ అధికారుల సమావేశం లో ఆయన మాట్లాడారు.

బెల్టు దుకాణంపై దాడులు

వాకాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన తోట శీనయ్య అక్రమంగా 10 మద్యం బాటిళ్లను అమ్ముతుండటంతో ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. సిబ్బంది రాజయ్య, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాకు మంగళం: కిలివేటి



మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య, పక్కన వైసీపీ నాయకులు

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులకు భరోసాగా ఇస్తున్న రూ.10వేలు కాకుండా దానిని రూ.20వేలు చేస్తామని టీడీపీ ఎన్నికలకు ముందు ప్రచారం చేసిందని, ప్రస్తుతం ఆ మత్స్యకార భరోసాకు టీడీపీ ప్రభుత్వం మంగళం పాడేసిందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో వైసీపీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిలివేటి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారుల జీవనభృతిని పక్కనపెట్టడమే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలుచేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆర్మోగం, సుందరరెడ్డి, తిరుమలరెడ్డి, వాసుమొదలి, రమేష్, పులికాట్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర, తమిళనాడు అధ్యక్షుడు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన వైసీపీ నాయకులు



పెళ్లకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెళ్లకూరు మండల జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు గురువారం తాడేపల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వైసీపీ నాయకులు కరణం రఘునాయుడు, కట్టా బాలసుబ్రహ్మణ్యం తదితరులను జగన్‌కు పరిచయం చేశారు.

ట్రాక్టరుతో డ్రమ్ సీడర్ వరి సాగు



పరిశీలిస్తున్న రమణ, నాగర్జునసాగర్

వెంకటగిరిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరుతో పనిచేసే డ్రమ్ సీడర్‌తో వరి విత్తడాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ అధిపతి డాక్టర్ సి.రమణ, ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని యాచసముద్రంలో రైతు సుబ్రహ్మణ్యం పొలంలో నిర్వహించిన డ్రమ్ సీడర్‌తో విత్తనాలు నాటే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. డ్రమ్ సీడర్‌తో సాగు చేపట్టడం ద్వారా కూలీల సమస్య అధిగమించవచ్చున్నారు. ఏవో సుజాత, రామ్మోహన్, సుమతి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలి

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్తితే ఏదైనా సాధించవచ్చునని శ్రీసిటీ క్రియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ అన్నారు. గురువారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో క్రమ శిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ, శ్రీసిటీ ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ పంచాయతీ అక్రమాలపై నోటీసులు


ఇందిరానగర్ పంచాయతీలో విచారణ చేస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. 2015 నుంచి 2022 వరకు జరిగిన పంచాయతీ నిధులకు సంబంధించిన అక్రమాలను స్థానికురాలు, సీసీఆర్‌ప్రతినిధి ఆడిపూడి ఆషా సమాచార చట్టం ద్వారా వెలికితీశారు. గతంలో కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లా అధికారులు విచారణచేసినా ఫలితం లేకపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ వైసీపీకి చెందిన వారు కావడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారనే విమర్శలున్నాయి. ఈ అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆషా మళ్లీ కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే వారు మరోమారు విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం జరిగిందని నిర్ధారించారు. అప్పట్లో ఇందిరానగర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన చిట్టిబాబు, నరేష్, తిరుమల, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, నాటి సర్పంచ్ రసూల్‌సాహెబ్, ప్రస్తుత సర్పంచ్ సల్లా వీరభద్రానికి నోటీసులు జారీ చేశారు.

కొత్తపాళెంలో భూమి కోసం రచ్చ

ఇరువర్గాల వాగ్వాదం



వివాదాస్పద భూమిలో చేపట్టిన చదును పనులు ● ఇరువర్గాలతో చర్చిస్తున్న తహసీల్దారు

రేణిగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాళెంలో ఓ భూమి విషయం ఇరువర్గాల నడుమ వాగ్వాదానికి దారితీసింది. ఒక వర్గం ఆ భూమిలో యంత్రాలతో చదును చేస్తుండగా మరో వర్గం అడ్డుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దారు సురేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని నిలుపుదల చేయించారు. విమానాశ్రయానికి సమీపంలోని కొత్తపాళెం రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 103/6సిలో 1.33, 104/ఎలో 2.74 ఎకరాల డీకేటీ భూమికి తిరుపతికి చెందిన వారి పేరుపై పట్టా ఉంది. ఈ భూమి ఫ్రీహోల్డ్‌లో ఉండడంతో త్వరలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో తిరుపతికి చెందిన వారు ఎక్స్‌కవేటర్ సాయంతో ఆ భూమి చదును చేసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న చెన్నైకు చెందిన లలిత ఫౌండేషన్ సభ్యులు పనులను అడ్డుకున్నారు. ఇరువర్గాల నడుమ తీవ్ర వాగ్వాదం జరిగింది. తహసీల్దారు సురేష్‌బాబు తన సిబ్బందితో కలిసి వివాదాస్పద భూమిని పరిశీలించారు. ఇరువర్గాలతో మాట్లాడారు. ఇరువర్గాల వద్దనున్న పత్రాలను అందిస్తే విచారణ జరిపి రికార్డుల ప్రకారం ఎవరికి చెందుతుందో తేలుస్తామని చెప్పడంతో ఇరువర్గాలు శాంతించి వెళ్లిపోయారు. సాయంత్రం మళ్లీ తిరుపతికి చెందిన వారు ఆ భూమిలో చదును చేసే పనులు చేపట్టడంతో రెవెన్యూ సిబ్బంది ఆ పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై తహసీల్దారును వివరణ కోరగా గతంలో ప్రభుత్వం ఈ భూమికి రైతువారి పట్టా మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఫ్రీహోల్డ్‌లో ఆ భూమి ఉందన్నారు. అయితే ఫ్రీహోల్డ్‌లో చేర్చిన భూముల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని స్పష్టం చేశారు. ఈ భూమి వివాదం తేలే వరకు అందులోకి ఎవరూ ప్రవేశించడానికి లేకుండా ఆంక్షలు విధించినట్లు తెలిపారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండ్లిమండపం గంగ జాతర కమిటీ చైర్మన్‌గా కాసరం రమేష్



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెండ్లి మండపం గంగమ్మ కమిటీ చైర్మన్‌గా కాసరం రమేష్‌ను గురువారం ఎన్నుకున్నారు. అనంతరం ఆయన, కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలంకారీ వస్త్రంతో సన్మానించి గంగమ్మ ప్రతిమను అందజేశారు. అనంతరం కొత్త కమిటీని ఎమ్మెల్యే సన్మానించారు. కోశాధికారిగా విజయకుమార్, ఉపాధ్యక్షులుగా ధనుష్, కొండిశెట్టి పెంచలయ్య, ప్రధాన కార్యదర్శిగా పాల్వాయి హేమంత్, సూరాగారి పవన్ కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

తహసీల్దార్ ఎదుట మందుబాబుల బైండోవర్



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంచన పుత్తూరుకు చెందిన ఇద్దరు బీఎన్ కండ్రిగలో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడంతో ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం ఎదుట గురువారం బైండోవర్ చేశారు. రెండోసారి అల్లర్లకు పాల్పిడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

మహాధర్నాను జయప్రదం చేద్దాం

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుపతి కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ప్రభాకర్, జనమాల గురవయ్య, కత్తి రవి, కాళయ్య, తులసీరాజ్ పాల్గొన్నారు.

బీడుభూముల సర్వేపై నీలినీడలు

వరదయ్యపాళెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం అంబూరులో సర్వే నెంబరు 272, 274-4, 275, 276-2లోని మేత బీడు భూమి ఆక్రమణల సర్వేపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆక్రమణపై బుధవారం సర్వే నిర్వహించిన అధికారులు గురువారం కొనసాగించలేదు. ఇంటింటా సర్వేపేరుతో ఆక్రమణల సర్వేను వాయిదా వేసినా రాజకీయ ప్రమేయంతో వాయిదా వేశారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలని హోంమంత్రికి వినతి



వరదయ్యపాళెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తమపై బనాయిచిన అక్రమ కేసులు ఎత్తేయాలని వరదయ్యపాళెం జనసేన నాయకులు శేఖర్, శ్రీనివాసులు, జానకిరామ్, శ్రీధర్ హోంమంత్రి అనితకు విజ్ఞప్తిచేశారు. గురువారం వారు అమరావతిలో హోంమంత్రిని కలిశారు. ● అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు వీఆర్‌ఏగా పనిచేస్తున్న సిద్ధయ్య అనారోగ్యంతో గురువారం మరణించారు. తహసీల్దారు మధుసూదన్‌రావు తొట్టంబేడు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో డీటీ జగన్‌మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఒకే గది.. మూడు తరగతులు



ఒకే గదిలో కొనసాగుతున్న 1, 2, 3 తరగతులు ● ఒకే గదిలో నిర్వహిస్తున్న 4, 5వ తరగతులు

వరదయ్యపాళెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం అంబూరు పంచాయతీలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు గదుల సమస్యతో అవస్థలు పడుతున్నారు. ఒకే గదిలో 1,2,3 తరగతులు మరో గదిలో 4,5 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక వలంటీరు ఉన్నారు. పాఠశాలకు తగినంత స్థలం ఉన్నా అదనపు గదులు లేక విద్యార్థులు, టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్లు చెప్పే పాఠాలు విద్యార్థులకు సక్రమంగా అర్థంగాని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం నాడు-నేడులో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు అదనపు తరగతి గదులను నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం


ఆకాశదీపానిన్ని పూజలు చేస్తున్న వేదపండితులు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆకాశదీపం శాస్త్రోక్తంగా వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి సతీమణి సుధ, ఏఈవో హేమమాలిని, సురేష్, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడండి


ఇనుప రాడ్లను పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ స్థలాన్ని కాపాడాలని ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈవోను కోరారు. రాజగోపురం ముందు గాంధీ మహాత్ముని విగ్రహం పక్కన ఆలయ స్థలంలో సుమారు 10 ఇనుప రాడ్లను కాంక్రీట్‌తో నాటడాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని ఆక్రమిస్తుంటే హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడం తగదన్నారు. గతంలో మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా స్థానికులు ఈ స్థలాన్ని ఆలయానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. అలాంటి స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెంటనే ఈవో బాపిరెడ్డి స్పందించి ఆలయ స్థలాన్ని రక్షించాలని కోరారు.

కార్తీక వనభోజనాలకు నటుడు సుమన్‌కు ఆహ్వానం



శ్రీకాళహస్తి, నవంబరు 21: శ్రీకాళహస్తి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో జరిగే కార్తీక వనభోజనాల కార్యక్రమానికి సినీనటుడు సుమన్‌ను ఆహ్వానించారు. గురువారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి గౌడ సంఘం చైర్మన్ పర్వతాల చంద్రశేఖర్‌గౌడ్, గౌరవాధ్యక్షులు అత్తి రాల శ్రీరాములుగౌడ్, బాలాజీ తిరుపతి జిల్లా లీగ్ అడ్వైజర్ ఉదయగిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జీవనజ్యోతి చెక్కు అందజేత



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం పంచాయతీలోని చిట్లావారికండ్రిగ గ్రామానికి చెందిన యనమల ప్రియకు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షలు చెక్కును సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ప్రియ భర్త మృతిచెందడంతో బీమా సొమ్ము మంజూరు చేశామన్నారు.

లోకేశ్‌ను కలిసిన తెలుగుయువత కార్యదర్శి రవినాయుడు



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా తెలుగు యువత కార్యదర్శి సముద్రాల రవినాయుడు మంత్రి లోకేశ్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలానికి సంబంధించిన పలు సమస్యలను వివరించినట్లు తెలిపారు. మంత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని వివరించారు.

ఉత్తమ టీచర్‌కి సన్మానం



ఏర్పేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో ఎంఈవో దయాకర్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల్ కుమార్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కో-ఆర్డినేటర్ శిరీష, ఉపాధ్యాయులు రమేష్, ద్వారకనాథ్‌రెడ్డి, కుమార్ రాజా, రాధాకుమారి, ఉమామహేశ్వర్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యార్థుల చేయూత



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం తొండమనాడులోని రాస్ వృద్ధుల సంక్షేమ కేంద్రానికి గురువారం డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలకు చెందిన విద్యార్థులు నిత్యాసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కిషోర్, వాసంతి కిషోర్, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, మేనేజరు దైవజ్ఞాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముళ్లచెట్ల తొలగింపు



వరదయ్యపాళెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలో పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద దారికి అడ్డంగా ఏపుగా ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. అధికారులు, పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన అధికారులు గురువారం తహసీల్దారు, ఎంపీడీవో, నీటిపారుదల శాఖ కార్యాలయాల వద్ద ఉన్న ముళ్లకంపలను తొలగించారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా రామచంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు హ్యూమన్‌రైట్స్ సౌత్ ఇండియా అధ్యక్షుడు సూర్యనారాయణ నియామక పత్రం అందజేశారు.

ప్రతి ఒక్కరికీ రేషన్ అందించాలి

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు అందించాలని తహసీల్దారు మధుసూదన్‌రావు సూచించారు. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో గురువారం డీలర్లు, వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యంతో పాటు కందిపప్పును అందిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఏర్పేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో యూరియాతో పాటు ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏర్పేడు మండల వ్యవసాయశాఖ అధికారి షణ్ముగం తెలిపారు. 45కిలోల బస్తా రూ.266.50కు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి పరిశ్రమతో గ్రామీణాభివృద్ధి


ప్రసంగిస్తున్న నాబార్డు జిల్లా మేనేజర్ సునీత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డు జిల్లా మేనేజర్ సునీత పేర్కొన్నారు. నాబార్డు సహకారంతో ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలోని నిరంతరం పశువైద్య విద్య సమాచార కేంద్రం 'పాడి పరిశ్రమ - గ్రామీణ వ్యవస్థాపకత' అంశంపై ఈ నెల 11 నుంచి వర్క్‌షాప్ చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో గ్రామీణ మహిళలకు పాడి పరిశ్రమపై శిక్షణ అందించారు. పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు విలువ ఆధారిత పాల పదార్థాల తయారీపైనా అవగాహన కల్పిస్తున్నారు. నాబార్డు జిల్లా మేనేజర్ సునీత మాట్లాడుతూ విలువ ఆధారిత పాల పదార్థాలతో మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, వెటర్నరీ వర్సిటీ డెయిరీ టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ విజయగీత, డాక్టర్ రవివర్మ, మునిరత్నం పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు పురుగుల మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి భారతి గురువారం పరిశీలించారు. ప్రభుత్వం అనుమతించిన పురుగు మందులను మాత్రమే విక్రయించాలని సూచించారు. అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరశురామేశ్వరుడి సేవలో రాయలసీమ హోంగార్డు ఇన్‌ఛార్జి



ఏర్పేడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం ఎస్పీ, రాయలసీమ హోంగార్డు ఇన్‌ఛార్జి ఎన్.మహేష్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆపార్‌ను వేగవంతం చేయండి

పిచ్చాటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆపార్‌ను వేగవంతం చేయడం కోసం మరిన్ని ఆధార్‌క్యాంపులు నిర్వహించాలని సెక్టోరియల్ అధికారులు గోపాల్‌రెడ్డి, సారథి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం పిచ్చాటూరు జడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును వారు పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. సాయికృష్ణ, జ్యోతి కుమార్ పాల్గొన్నారు.